కథ

# వంతెన

ప్రణవి

'నిజానికి ఈ ఫేర్‌వెల్‌ని ఆఫీసు తరపున ఎరేంజ్ చేసుండాల్సింది'

'మరి ఎందుకు చెయ్యలేదు... ఆర్గనైజేషన్ ఒప్పుకోలేదా?'

'ఎందుకొప్పుకోదు?'

'అవును ఎందుకొప్పుకోదు... మీరు చెప్తే డెఫినెట్‌గా ఒప్పుకొంటుంది'.

'చూడు శ్రావణీ... ఇలాంటి మాటలు అనేవాళ్లకు ఆనందం కలిగించవచ్చు. కానీ... వినేవాళ్లకి మాత్రం మరోలా అర్థమవుతాయి'.

'అర్థం చేసుకోవడం అనేది వాళ్ల వాళ్ల సంస్కారాన్ని బట్టి ఉంటుంది'.

'అపార్థానికి అవకాశం ఇచ్చేదీ నువ్వే... సంస్కారం లేదని తప్పులు పట్టేదీ నువ్వే. నేను చెప్తే ఆర్గనైజేషన్ ఒప్పేసుకుంటుందంటే... దానర్థం ఏమిటి?'

'సారీ మేడం... మీతో మాట్లాడ్డం చాలా కష్టం.'

'కష్టమా... ఎందుకు?'

'.........'

'చూశావా... నీ దగ్గర సమాధానం లేదు... ఎందుకో తెలుసా?'

'......'

'ఇది మంచి పద్ధతి కాదు శ్రావణీ... అవకాశం దొరికితే అతిగా స్పందించడం... దొరక్కపోతే అసలే స్పందించకపోవడం. దీనివల్ల నష్టం జరిగేది. ఎవరికో తెలుసా? మనకే! సామాన్యంగా ప్రైవేట్ ఆర్గనైజేషన్స్‌లో చాలామంది ఉన్న చోటనే ఉండిపోవడానికి అసలు కారణం ఇదే.'

'నిజమే. మాట్లాడ్డం చేతకాకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. కానీ... అదే మూల కారణం అంటే మాత్రం ఒప్పుకోవడం కష్టం.'

'నేను చెప్తున్నది మాట్లాడ్డం గురించి కాదు. స్పందించడం గురించి. సమయానికి అనుకూలంగా స్పందించకపోవడం వల్లే నువ్వీరోజు రిజైన్ చెయ్యాల్సొచ్చింది. సరిగ్గా ఆలోచించి చెప్పు. అవునా? కాదా?'

'కావచ్చు'.

'గోడ మీద పిల్లిలా కావచ్చేంటి కావచ్చు... సే ఎస్ ఆర్ నో'.

'మేడం... అలా దబాయించడానికి ఇదేం ఆఫీసు కాదు'.

'అది నాకూ తెలుసు. కనీసం ఈ చివరి మీటింగ్‌లో అయినా డాబూ దర్పాలూ ప్రవేశించకుండా వుండాలనే దీన్ని పెర్సనల్‌గా ఇలా ఇంట్లో ఏర్పాటుచేసింది'.

'పెర్సనల్ అంటున్నారు కాబట్టీ... ఒక్కమాట, నేను మీ పట్ల సరిగ్గా స్పందించక పోవడం వల్లే నాకీ పరిస్థితి. ఎదురైందనుకోవచ్చా?'.

'డెఫినెట్లీ అనుకోవచ్చు. నీకలా అనిపించడం తప్పు కాకపోవచ్చు కూడా. కానీ సంస్థల నిర్ణయాల్లో వ్యక్తుల ప్రమేయం ఉన్నంత మాత్రం చేత ఏ వ్యక్తి వల్లా సంస్థలు నిర్ణయాలు తీసుకోవు'.

'నో... కొంతమంది వ్యక్తులు సంస్థల్ని శాసించగలరు'.

'అలా శాసించగలిగేది సంస్థల యజమానులు మాత్రమే'.

'మరి ఆ యజమానుల్ని ప్రభావితం చెయ్యగలిగిన వాళ్లు?'

'ఉంటే ఉండొచ్చు. కానీ వాళ్లు కన్విన్స్ చెయ్యడానికే పరిమితం'.

'మాటలు వేరైనా అర్థం అదే. చర్యలు వేరైనా ఫలితం అదే.'

'ఓ.కే.. అలా అనుకోవడం వల్ల నీకు ఉపశమనం కలుగుతుందనుకుంటే నీ ఇష్టం. కానీ సందర్భం వచ్చింది కాబట్టి... ఓ మాట చెబుతాను. మనిద్దరి మధ్యా ప్రవహిస్తున్న నది, పేరుకి ప్రాణహితే అయినా... నువ్వా తీరం! నేనీ తీరం! రాక పోకలకి బల్లకట్టు చాలనుకుంటావు నువ్వు. కానీ వంతెనలు ఉండా లంటాన్నేను'.

'మీరెప్పుడూ ఆ వంతెనలు కట్టే ప్రయత్నం చేసినట్టు నాకనిపించలేదు'.

'అందుక్కారణం నేను కాదు. నేను నీ హితాన్ని కోరే విషయం కనీసం నువ్వు గుర్తించే ప్రయత్నమైనా చేయలేదు'.

'మీరు బాస్ కాబట్టి మీరేం చెప్పినా అది నా హితం కోసమే అన్నట్టు మాట్లాడితే నేనేం చెప్పగలను?'

'మనం ముందే ఓ అభిప్రాయం ఏర్పరచుకుని ఆ చట్రం లోంచి చూశా మనుకో... అప్పుడు ఎలాంటి సన్నివేశమైనా ఆ అభిప్రాయానికి అనుగుణంగానే కనిపిస్తుంది. ఏ చట్రాలూ లేకుండా చూసుకోవడమే విజ్ఞత'.

'అంటే నేను విజ్ఞత లేనిదాన్ననేగా?'

'బాగుంది'.

'ఏమిటి బాగున్నది?'

'నీ బుంగమూతి'.

'మాట మార్చకండి'

'మాట మార్చడం కాదు. ఉన్నమాటే అంటున్నాను. నువ్వలా బుంగమూతి పెట్టుకుంటే ఎంతందంగా ఉంటావో తెల్సా?'

'ఎందుకంటే ఆ బుంగమూతి పెట్టినప్పుడు నువ్వు సరిగ్గా మన తెలుగు సినిమాల్లోని మధ్య తరగతి భార్యంత బాగుంటావు గనక. ఆ సినిమా భార్య అంతందంగా కనపడ్డం వెనక ఎంతో మంది కృషి ఉంటుంది. దాని వెనక అంత కంటే పటిష్టమైన కుట్ర ఉంటుంది'.

'కుట్రా?'

'ఖచ్చితంగా కుట్రే. అది ఆడదాన్ని పొగడ్తలకి లొంగిపోయే బలహీన మనస్కు రాలిగా మలిచేకుట్ర. బుద్ధిని ఎదగనివ్వకుండా నియంత్రించే కుట్ర. బానిసత్వం లోనే స్వాతంత్ర్యం వెతుక్కునే అమాయకురాళ్లగా కుట్ర. అందాన్ని అందమైన చీరగా చుట్టి ముందరి కాళ్లకి బంధం వేసే కుట్ర'.

'ఏమో నాకు నమ్మకం కలగట్లేదు'

'మీ ఆయనెప్పుడైనా నీ బుంగమూతిని చూశాడా?'

'ఊఁ.... ఆయన కూడా మీలాగే అంటాడు.'

'అంటే బుంగమూతి వెనక కుట్ర ఉందనా?'

'కాదు... నేను బుంగమూతి పెడితే చాలా అందంగా ఉంటానని....'

'అయితే దేనికో టెండర్ పెడుతున్నాడన్న మాటే'

'ఆయనేం అలాంటి వారు కాదు'

'ఏం... ఆయనంటే అంత నమ్మకమా?'

'భార్యాభర్తల బంధానికి మరింత బలం చేకూర్చేది ఆ నమ్మకమే'

'నిజమే. భర్తలకి కావలసింది కూడా భార్యల్ని ఆ నమ్మకంలో ఉంచటమే. మరీ పెర్సనల్ అనుకోకపోతే ఓ మాట అడుగుతాను. మీ ఇద్దరూ ఎప్పుడైనా గొడవ పడ్డారా?'

'భార్యాభర్తలన్నాక ఆ మాత్రం గొడవల్లేకుండా ఎలా ఉంటాయి?'

'అంటే ఏ గొడవలూ లేకుండా సంసారం జరగదంటావా?'

'ఏం... మీరెప్పుడూ గొడవలు పడలేదా?'

'లేదు'

'నేన్నమ్మను. మనుషులన్నాక ఏదో ఒక సందర్భంలో ... ఏదో ఒకవిధంగా మనస్తాపాలు, అపార్థాలు రాకుండా ఉండవు'.

'అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?'

'ఎలాగంటే... ఊఁ... అన్నివేళ్లూ ఒకేలా వుండవు. ఎవరి అభిప్రాయాలు, అభిరుచులు వాళ్ళకుంటాయి. అవి కలవనప్పుడు కోపతాపాలూ ముఖం చెండు కోవటాలూ తప్పవు.'

'ఏం... ఒకరి అభిప్రాయాలు ఒకళ్లు తెలుసుకుని ఆ ప్రకారం నడుచుకుంటే సరిపోతుందిగా?'

'మనం వాళ్ల అభిప్రాయం ప్రకారం నడుచుకుంటే సరిపోదు. వాళ్లూ మన ఇష్ట ప్రకారం నడచుకోవాలి'.

'అదీ అసలు సమస్య. వాళ్లు మన ఇష్టప్రకారం లేరు కాబట్టి... మనం వాళ్ల ఇష్టాల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అంతేగా?'

'అలా కాదు'.

'సమర్థించుకోవాలని చూడకు. మనిషి మెలకువగా ఉండేది పదహారు గంటలు. అందులో ఎనిమిది గంటలు ఆఫీసుకి... నాలుగ్గంటలు సిటీ బస్సులకీ బస్టాపులకి ఖర్చయిపోతాయి. మిగిలిన ఆ కొద్దిపాటి సమయమూ... ఆయన అలా అన్నందుకు నువ్వూ, నువ్విలా అన్నందుకు ఆయనా... కోడిగుడ్లకు ఈకలు పీకడం తోనే సరిపోతుంది. చివరికి పిల్లల గురించి ఆలోచించడానిక్కూడా తీరిక ఉండదు. వాళ్లను పట్టించుకోలేక పోతున్నామనే బాధ మాత్రం మిగిలిపోతుంది. ఆ బాధ ఎక్కువైనప్పుడల్లా పిల్లలు కేంద్రంగా మొదలవుతాయి.... పెద్దల మనస్తాపాలు!

'నిజమే మేడం... నాకూ చాలాసార్లు అలాగే అనిపించింది'

'ఏమని?'

'మేం మనుషులం ఎంత దగ్గరగా ఉన్నామో... అంతే దూరంగా ఉన్నామని'.

'మరీమాట ఎప్పుడైనా మీ వారితో అన్నావా?'

'లేదు. అయినా మీరీ విషయం ఎలా కనిపెట్టారు మేడం?'

'నువ్వు మీవారితో గడిపే సమయం కంటే నాతో గడిపే సమయం కనీసం రెండింతలు ఎక్కువ. అయినా నీ ఫీలింగ్స్‌ని నాతో ఎప్పుడూ పంచుకోలేదు. చివరికి నీ థాట్స్ గురించి కూడా చర్చించలేదు. దీన్ని చూస్తేనే అర్థమౌతుంది'.

'కరెక్టుగా చెప్పారు. అందుకే మీరంటే నాకిష్టం'.

'మరి నా గురించి చాటుమాటుగా చెవులు కొరుక్కున్నప్పుడు?'

'అంటే.... అదీ...'

'అదేమిటో నేను చెబుతాను. మనం ఎప్పుడైతే ఒక మనిషి గురించి చెప్పాలను కున్నది ఆ మనిషితో చెప్పలేకపోతామో అప్పుడు ఆ మనిషి గురించే ఆలోచిస్తాం'.

'ఔను మేడం. ఒక్కోసారి ఆ ఆలోచనల్తో నిద్ర కూడా పట్టదు'.

'అదే ఆ మనిషితో మాట్లాడితే? అప్పుడు మనుషులు దూరంగా ఉన్నామనుసుల మధ్య దగ్గరితనం పెరుగుతుంది. కానీ మాట్లాడం. దాంతో ఆ మనిషి మన మెదడు తినేస్తూ ఉంటాడు. దాన్నుంచి తప్పించుకోవడానికి ఎవరో మూడో మనిషి దగ్గర మన గోడు వెళ్లబోసుకుంటాం. మళ్లీ అందులో కూడా అవసరాలు అవకాశాలూ ప్రాధాన్యతల్ని నిర్దేశిస్తాయి. మీ వారితో అవసరం చివరిదాకా ఉంటుంది గనక ఆయనలో లేని మంచిని కూడా ఉన్నట్టు ప్రచారం చేస్తావు. అదే నా గురించైతే...? నీలాంటి వాళ్లతో కలిసి ఆడిపోసుకునే అవకాశం దొరుకుతుంది కాబట్టి నా వైయక్తిక జీవితం గురించి చివరికి నాక్కూడా తెలియని విషయాల్ని యథేచ్ఛగా మాట్లాడుకుంటారు. భర్తంటే జీవితాంతం భరించవలసిన వాడనే అపోహ, బాసంటే ఇంకో ఉద్యోగం దొరికే వరకు తప్పని తద్దినం అనే తేలిక భావం ఉండటం వల్లే ఇలా జరుగుతుంది.

'మేడం, మీరు మరీ లాజికల్‌గా మాట్లాడుతున్నారు. మనిషి ప్రవర్తన అన్ని సందర్భాల్లోనూ లాజిక్‌కి అందేలా ఉండదు. అయినా, అన్నీ లాజికల్‌గా ఆలోచించుకుంటూ పోతే నైతిక విలువలనే మాటలకే అర్థం లేకుండా పోతుంది. మనుషులన్నాక కొన్ని నియమాలు, పరిమితులు, పద్ధతులు ఉండక తప్పదు'.

'అలాగని వాటి వలలో చిక్కుకుని మన ఆత్మాభిమానాన్నీ, స్వాతంత్ర్యాన్ని కూడా ఫణంగా పెట్టేద్దామంటావా?'

'స్వాతంత్ర్యం అంటే విశృంఖలత్వం కాదు'.

'అంటే నీ ఉద్దేశం?'

'ప్రతీదానికి కొన్ని లిమిట్స్ ఉంటాయి.'

'అలా అంటే ఎవరు మాత్రం ఏం చెప్పగలరు?'


'శ్రావణీ... నాకు తెలియవనుకుంటున్నావా? నా వెనక మీరాడుకునే మాటలు?'

'మరి తెలిస్తే నాతో చెప్పించాలని ఎందుకు చూస్తున్నారు?'

'ఎందుకంటే... నువ్వు నిజం అనుకుంటున్నవన్నీ నిజాలు కావనీ నీకు కనిపిస్తున్న నలుపు నీ రంగుటద్దాలదనీ...'

'ఆ అద్దాల్ని తీసి పక్కన పెట్టాలనీ... అంతేగా?'

'మనుషుల్ని దగరకు చేర్చే వీ మాటలే... దూరం చేసేవీ మాటలే. అందుకే ఆ మాటలు బల్లకట్టల్లే కాక వంతె




నల్లా ఉండాలనేది. ఎదుటివాళ్లని మాట్లాడ నిచ్చినంత సేపూ మనం వారికి దగ్గరవుతాం. వారి మాటల్ని వినకుండా మన మాటల్నే వినిపించినకొద్దీ వారు మనకు దూరమవుతారు. మేనేజ్‌మెంట్ స్కిల్స్‌లో మనం ముందుగా నేర్చుకోవాల్సింది ఈ పాఠమే'.

'కావచ్చు. కానీ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో కొలవటానికి జీవితం బిజినెస్ కాదు. ఇందులో ఫీలింగ్స్, ఎమోషన్స్ ఎన్నో ఉంటాయి'.

'అయినా సరే.... జీవితం కూడా బిజినెస్సే.'

'మీక్కావచ్చేమో గానీ... అందరికీ కాదు!'

'ఓకే... నాకు జీవితమే బిజినెస్... అందుకే అన్నీ లాభనష్టాలే బేరీజు వేస్తాను. కానీ నీకు జీవితమంటే అనుబంధాలూ ఆప్యాయతలూ అనురాగాలే కదా, అయినప్పుడు గృహమే కదా స్వర్గసీమ అని పాడుకుంటూ ఇంట్లో కూర్చొని భర్తనీ, పిల్లల్నీ చూసుకుంటూ అత్తమామల సేవ చేసుకుంటూ ఆనందంగా గడిపేయొచ్చుగా'.



'అదేంటి మేడం... అలా అంటారు. సాటి ఉద్యోగస్థురాలి గురించి మీరింత చులకనగా మాట్లాడగలరని నేనూహించలేదు. అయినా చదువుకున్న ఆడది ఉద్యోగం చేయడంలో తప్పేముంది?'

'తప్పన్నేనెలా అంటాను? నేనూ ఉద్యోగం చేస్తున్నదాన్నేగా... నువ్వు, చదువుకున్న చదువుని పెట్టుబడిగా పెట్టి ఉద్యోగం చేస్తున్నావు. లాభంగా ప్రతి నెలా జీతం తీసుకుంటున్నావు. అదీ ఒక రకంగా వ్యాపారమే. నువ్వు, నీలాంటి ఉద్యోగస్థులు అందరూ కూడా మీరుచేస్తున్న ఆర్గనైజేషన్‌లో భాగమే. మీ ఆర్గనైజేషన్ చేస్తున్నది వ్యాపారమైనప్పుడు మీరూ వ్యాపారంలో భాగమే అవుతారు'.

'అయ్యుండచ్చు. అంత మాత్రం చేత జీవితాన్ని వాణిజ్య విలువలతో కొలవడం, స్వలాభం కోసం పై అధికారుల్ని మంచి చేసుకోవడానికి....'

'ఆపేశావేం... చెప్పు.'

'సారీ... నా నోటితో చెప్పలేను'

'ఎందుకు?'

'ఎందుకంటే... అలాంటివాటి గురించి మాట్లాడ్డం నాకిష్టం ఉండదు'.

'అలాంటివంటే ఎలాంటివి?'

'నాతో అనవసరంగా మాట్లాడించకండి'

'లేదు... మాట్లాడాలి. మాట్లాడకపోతే మౌనం మనుషుల మధ్య అడ్డుగోడగా మారిపోతుంది. దాదాపు ఐదేళ్లుగా మన మధ్యన పర్వతాల్లా పెరిగిపోయిన అడ్డుగోడల్ని తవ్విపొయ్యడానికీ, కందకాల్ని పూడ్చడానికి మళ్లీ ఇంత మంచి అవకాశం రాదు. అందుకే అడుగుతున్నాను. చెప్పు... నువ్వు మాట్లాడలేనంటున్నది దేని గురించి?'

'స్త్రీ పురుషుల సంబంధాల గురించి! అధికారులూ ఉద్యోగస్థుల సంబంధాల గురించి! కేవలం స్వార్థం కోసం నైతిక విలువల్ని తుంగలో తొక్కడం గురించి'

'చూడు శ్రావణీ... ఏది నైతికం, ఏది అనైతికం అనేది లోతుగా విశ్లేషించు కుంటూ వెళ్తున్నకొద్దీ మనం

నైతికాలు అనుకున్న ఎన్నో విలువలు ఎదుటివారికి అనైతికాలుగా మారిపోతాయి. అంచేత మనం మరీ అంత విస్తృతార్థంలో మాట్లాడితే సమాధానాలు మరింత విస్తృతార్థాల్ని కల్పించుకుంటాయి. అవి చివరికి సూక్తులుగా మారి పాఠ్యపుస్తకాల్లో మిగిలిపోతాయి. అంచేత బీ పర్టిక్యులర్ అండ్ బీ క్లియర్'.

'క్లియర్‌గా చెప్పాలంటే నేను మాట్లాడుతున్నది దాని గురించే'.

'దాని గురించి అంటే?'

'అదే ఆ సంబంధం గురించి...'

'యూ ఆర్ నాట్ యెట్ క్లియర్... ఆ సంబంధం అంటే?'

'.......'

'ఊc.... చెప్పు...'

'......'

'నాకూ మన బాస్‌కీ...'

'.....'

'చెప్పడానికి పచ్చివెలక్కాయలా నీ సంస్కారం అడ్డం పడుతున్నట్టుంది. ఓ.కే. మా మధ్యన ఏముందో నువ్వు చూశావా?'

'లేదు'

'మరి చూడనప్పుడు మా మధ్యన ఏముందో... ఎలాఉందో... పది మందికీ ఎందుకు ప్రచారం చేశావనేది నేనడగను. ఎందుకంటే, చాలామందికి ఓ ఆడ, మగ కలిసుండటం గురించి మాట్లాడటం వేడివేడి మిరపకాయ బజ్జీలు తింటున్నంత హాట్‌గా ఉంటుంది. చివరికి వాళ్ల ఎసిడిటీ వాళ్లనుభవిస్తారు. అది వేరే విషయం. న్యాయస్థానాలు కూడా స్త్రీ పురుష సంబంధాల్లోని నైతికతను గురించి చాలా ప్రత్యేకమైన సందర్భాల్లో తప్ప మాట్లాడవు. చివరికి శిక్షలు విధించే సమయంలో కూడా ఆడవాళ్లకి ప్రత్యేకమైన రక్షణలు కల్పిస్తాయి. కానీ మీకు కనీసం సాటి ఆడదాన్నన్న జాలి కూడా లేదు. ఒక మనిషి వెనక అన్నేసి మాటలు అనడం కంటే ముందుకొచ్చి ఒకే ఒక్కమాట నీకూ మన బాస్‌కీ శారీరక సంబంధం ఉందా? అని నన్నే అడిగుంటే అప్పుడు నేనే వివరంగా చెప్పేదాన్ని. ఇప్పుడు నేనడుగుతున్నాను. చెప్పు. రాత్రి నువ్వూ మీవారూ ఏం చేశారు?'

'చేయడానికేముంటుంది?'

'అదే ఏముంటుందో చెప్పు'

'సిగ్గు విడిచి ఎలా చెప్పమంటారు మేడం?'

'అంతగా సిగ్గనిపిస్తే... సిగ్గుపడుతూనే చెప్పు'.

'ఏముంది... అందరూ చేసేదే...'

'నీకే మాత్రం అనీజీగా అనిపించలేదా?'

'ఎందుకు మేడం అలా అడిగారు?'

'నిన్న నీకు ఒంట్లో బాగో లేదు కదా... అందుకడిగాను...'

'నిజమే... అనీజీగా మాత్రమే కాదు. రోతగా కూడా అనిపించింది'

'మరీ విషయం ఆయనకి చెప్పావా?'

'ఊహుc....'

'ఎందుకు?'

'ఎందుకంటే ఏం చెప్పను? అయినా కాదనడానికి ఆయనేమైనా పరాయి మనిషా?'

'ఆయన పరాయిమనిషి కాకపోతే నీకు ఒంట్లో బాగోలేని విషయం ఎందుకు గుర్తించలేకపోయాడు?'

'.....'

'చెప్పు...'

'అదీ... ఆయనన్నడగాల్సిన మాట. నన్నడిగితే నేనేం చెప్పను?'

'నువ్విలా మొండిగా మాట్లాడ్డానికి కారణం మీరిద్దరూ ఎప్పుడూ మనసు విప్పి మాట్లాడుకోక పోవటమే...'

'.....'

'ఔనా? కాదా?'

'.......'

'నేనడిగింది అంతగా ఆలోచించి సమాధానం చెప్పాల్సినంత పెద్ద విషయం కాదు. అయినా నువ్వు ఆలోచిస్తున్నావూ అంటే..... నువ్వాలోచిస్తున్నది సమాధానం చెప్పడం గురించి కాదు. సమాధానం చెప్పాలా వద్దా అన్నదాని గురించి. ఔనా?'

'ఔను'.


'ఇప్పుడు చెప్పు. మీరెంతసేపూ ఒకరినొకరు అంచనావేసే ప్రయత్నాలే చేశారు. తప్ప పరస్పరం విశదపరచుకునే ప్రయత్నం చెయ్యలేదు... ఔనా?'

'....'

'ఫరవా లేదు. టేక్ యువర్ ఓన్ టైమ్'.

'ఎస్ మేడం.... యూ ఆర్ రైట్. కానీ ఇది మీరెలా గ్రహించగలిగారు?'

'దాదాపు పదేళ్లక్రితం నా పరిస్థితీ ఇలాగే ఉండేది'.




'అంటే మీకంతకు ముందే పెళ్లైందా?'

'ఏం... ఆ విషయం నీకు తెలియదా! అది నీకూ తెలుసనీ అప్పుడప్పుడు దాని గురించి నీ కొలీగ్స్‌తో మాట్లాడుతుంటావని కూడా నాకు తెలుసు. నీకు తెలియని ఓ విషయం ఏంటంటే, మాకు విడాకులు మంజూరయ్యాయనీ, అతని కోరిక మేరకు నా అనుమతితో మా అబ్బాయిని అతనే పెంచుకుంటున్నాడనీ'.

'అసలాయనకీ మీకూ...'

'పొసగలేదంతే'.

'మీరిక్కడికి వచ్చినప్పుడు ఓ బిడ్డ తల్లిలా కాకుండా అప్పుడే డిగ్రీ తీసుకొచ్చిన అమ్మాయిలా చాలాఫ్రెష్‌గా ఉండేవారు. గుర్తు చేసుకుంటే నాకిప్పటికీ ఆశ్చర్యం గానే ఉంటుంది'.

'వాస్తవాలెప్పుడూ ఆశ్చర్యకరంగానే ఉంటాయి'.

'మేడం... మనకి ఎప్పుడూ ఇంత ఫ్రీగా మాట్లాడుకునే అవకాశం రాలేదు కాబట్టి అనిపించలేదు గానీ ఇప్పుడు మీ మాటలు వింటుంటే మీలో మేం ఊహించుకుంటున్నట్టు కేవలం నిగూఢత కంటే మేం చూడని మరో కోణం ఏదో ఉందనిపిస్తోంది. ఇఫ్‌యూ డోంట్ మైండ్... మీ గురించి మరింత తెలుసుకోవాలనుంది.'

'తెలుసుకుని ఏం చేస్తావు?'

'దాని గురించి మీ వెనక మాత్రం మాట్లాడను'.

'నా ఉద్దేశం అది కాదు. నాది నువ్వు తెలుసుకోవలసినంత గొప్ప జీవితం కాదూ అని'.

'అది మీ ఉద్దేశం కావచ్చు. నేను చెప్పదగినదాన్ని కాదని మీకనిపిస్తే అది మీ ఇష్టం'.

'సరే చెప్తాను. మా నాన్న చాలా కట్టుదిట్టమైన సాంప్రదాయవాది. నాకు పద్నాలుగో యేటో పెళ్లి చేస్తే మంచిదని నా జాతకంలో ఉందట. దాంతో బాల్య వివాహాలు చేయడం నేరమని తెలిసి కూడా నాకు బలవంతంగా పెళ్లి చేశాడు'.

'మీ వారు?'

'ఆయనో పోలీస్ కానిస్టేబుల్. ఆయనిష్టపడింది నన్ను కాదు. నా అందాన్ని'.

'నిజమే మేడం... మీ అందాన్ని చూసి అసూయపడితేనే ఆడది. ఆశ పడితేనే మగాడు'.

'పెళ్లైన రెండు, మూడు నెలలకే ఆయనంటే గౌరవం నశించిపోయింది. సిగరెట్లు... మందు... రైడింగ్‌లో పట్టుబడ్డ అమాయకురాళ్లు.... ఆయనకి లేని దురలవాట్లు లేవు'.

'మరి మీరాయన్ని మార్చే ప్రయత్నం చేయలేదా?'

'బహుశః భార్యనేది భర్తని మార్చుకునేంత శక్తి కలిగినదనే అవగాహన అప్పట్లో నాకు లేదనుకుంటాను. అదీగాక ఒక మనిషిని మరొక మనిషి మార్చటం అంత సులభమైన విషయం కాదు. అందుకే ఆయన ఏ వెధవ పని చేసినా బాధపడే దాన్ని! ఏడ్చేదాన్ని! దాన్ని అలుసుగా తీసుకుని ఆయన మరింత రెచ్చిపోయేవాడు! నేను మరింతగా కుమిలిపోయే దాన్ని'.

'భార్యాభర్తల మధ్యన అండర్ స్టాండింగ్ లేకపోతే అంతే'.

'యూ ఆర్ రైట్. ఒకవేళ ఆయనతోనే సర్దుకుపోయి ఉంటే నేనిప్పటికీ మన టీవీ సీరియల్ పతివ్రతలా ఏడుస్తూనే ఉండి పోయేదాన్నేమో!'

'మరి ఎలా బయటపడ్డారు?'

'ఓ రాత్రి ఎవరో అమ్మాయిని తీసుకొచ్చి వండి పెట్టమన్నాడు. దాంతో నాకు ఒళ్లమండి నీకు అదికావాలో నేను కావాలో తేల్చుకోమన్నాను. అతను మొండిగా

అదే కావాలన్నాడు. నేను అంతకంటే మొండిగా కట్టు బట్టలతో బయటి కొచ్చేశాను. అప్పటికే నేను గర్భవతి నన్న విషయం నాకింకా తెలియదు. నేను పుట్టింటికి వెళితే నాన్న మళ్లీ తీసుకొచ్చి వాడి దగ్గరే వదిలేస్తాడు. లేకపోతే నా పాతివ్రత్యం, ఆయన సాంప్రదాయాలూ మంట కలుస్తాయనుకుంటాడు. అందుకే తిన్నగా ఆ ఊరొదిలిపెట్టి ఈ నగరానికొచ్చాను'.

'అంత చిన్న వయసులోనే ఎంత ధైర్యం?'

'ఏమో.... తెలిసీ తెలియని వయసు కాబట్టే అంత ధైర్యం చేయగలిగానేమో'

'తరవాత?'

'తరవాతేముందీ... ఉన్న బంగారం అమ్ముకు తినడం. అది పూర్తయ్యే నాటికి ఇక్కడ ఉద్యోగం సంపాదించుకోవడం. ఆ తరువాత మీ మాటల్లోనే చెప్పాలంటే బాసుని పట్టడం, ప్రమోషన్లు కొట్టడం.

'లేదు మేడం.... మీరు చాలా హార్డ్ వర్కర్. కష్ట పడి చదువుకుని పైకొచ్చారు మీ టాలెంట్ ప్రూవ్ చేసుకున్నారు...'

'వద్దులే... ఇప్పుడలా అన్నావంటే హార్డ్‌వర్క్ టాలెంట్ అన్న మాటలకి అర్థమే మారిపోతుంది. అంచేత టాపిక్ మారుద్దాం. అప్పట్లో నాలో నేను కుమిలి పోవటం కాకుండా మరింత లోతుగా ఆలోచించి ఆ కానిస్టేబుల్‌ని మార్చటానికి ఇంకాగట్టి ప్రయత్నాలు చేసి ఉంటే కొంతమేరకు మార్చగలిగినా మరికొంత మేరకు నేనూ మారిపోయి ఉండేదాన్ని'.

'అప్పుడు మీరింత మంచి పొజిషన్‌కు వచ్చి ఉండే వారు కాదు. కేవలం ఓ కానిస్టేబుల్ భార్యగా మిగిలి పోయి ఉండేవారు'.

'అలాగని మంచి పొజిషన్‌కోసం అందాన్ని ఎరగ వేయడాన్ని నేనూ సమర్థించను. అలాగే నాకూ బాస్‌కీ మధ్య ఏ సంబంధమూ లేదని బుకాయించను. అయితే మనిషి ఎదుగుదలకు అడ్డుపడే ఏ విలువలూ విలువైనవి కావు. ఏ వ్యక్తికైనా సరే తనని తాను ఎలా వ్యక్తం చేసుకోవాలో తెలియకపోతే ఆ వ్యక్తికి ఎదుగుదల ఉండదు. ఈ విషయం నా కర్థమైంది మన బాస్ పరిచయం వల్లనే. ఎంతటి కఠిన సమస్యలైనా సమక్షంలో కూర్చుని మాట్లాడుకుంటే క్షణాల్లో పరిష్కారమవుతాయి'.

'నిజమే కావచ్చు. మీరు ఇంత ఓపిగ్గా మాట్లాడతారని గానీ, మీ సహచరుల్ని ఇంత లోతుగా అబ్జర్వ్ చేస్తారని గానీ వాళ్ల గురించి ఇంతగా ఆలోచిస్తారని గానీ నేనూహించలేదు. ఎలాగూ ఇంతవరకూ వచ్చింది గనుక మిమ్మల్ని ఓమాట అడగచ్చా?'

'ఏమిటది?'

'మీ వల్ల మన బాస్ ఫ్యామిలీ డిస్టర్బ్ అవుతుందని మీకెప్పుడూ అనిపించలేదా?'

'అనిపించడం కాదు... ఇది దాదాపుగా నన్ను మూడు సంవత్సరాలపాటు వెన్నంటి వేధించిన ప్రశ్న. ఎంత ప్రయత్నించినా ఆయనకి నా మీదున్న వ్యామోహాన్ని తగ్గించలేకపోయాను'.

'మీ అందం అలాంటిది లెండి మేడం'

'కానీ ఈ అందం నేను సంపాదించుకున్నది కాదు. నేను సంపాదించుకోవలసిన అందం వేరే ఉంది. ఈ విషయం నాకు అర్థమయ్యేలోపే నేను ఆయన సాంసారిక జీవితంలో విషపు బిందువులా మారిపోయాను. అందుకే నా ప్రయత్నాలూ నేను మొదలు పెట్టాను...'

'అందులో భాగమేనా... ధీరజ్‌తో ప్రేమ.'

'ఒక విధంగా అంతే'.

'ఒక తప్పుని సరిదిద్దడానికి మరో తప్పు....'

'తప్పు కాదు'.

'ఎందుక్కాదు? రేపెప్పుడైనా బాస్ విషయం ధీరజ్‌కి తెలిస్తే... అతని భవిష్యత్తేం కావాలి?'

'ఏమౌతుంది? ఏమీ కాదు.!'

'నిజం నిప్పులాంటిది మేడం... ఎప్పుడో ఒకప్పుడు బయటపడక తప్పదు'.

'మనం దేన్నైనా దాచిపెడితే గదా... బయట పడడం అనే ప్రశ్న ఉత్పన్న మయ్యేది?'

'వ్వాట్? మీకూ బాస్‌కీ ఉండే సంబంధం గురించి ధీరజ్‌కి తెలుసా?'

'అతనికి తెలియదు. నేనే చెప్పాను'.

'ఏమిటీ? మీరు... ధీరజ్‌కి బాస్ గురించి చెప్పారా?'

'బాస్ గురించి మాత్రమే కాదు... ఆ పోలీస్ గురించి, వాడిక్కనిచ్చిన కొడుకు గురించి కూడా చెప్పాను.'

'మీరు ధీరజ్‌కి నిజం చెప్పి కన్విన్స్ చేశారా? చాలా ఆశ్చర్యంగా ఉందే!'

'ఇందులో ఆశ్చర్యపోవడానికి ఏముంది? కాలం మారుతోంది. దాంతో పాటు మనుషులూ వాళ్ళు ఏర్పాటుచేసుకున్న విలువలూ కూడా మారక తప్పదు. నిజానికి నీకు ఆశ్చర్యం కలిగినందుకు ఆశ్చర్యపోవాలి గానీ, ధీరజ్ అర్థం చేసుకున్నందుక్కాదు. నువ్వింకా ఆశ్చర్యపోయే విషయం మరొకటుంది. ధీరజ్ తన తల్లిదండ్రులతో నా గురించి అన్నీ వివరంగా చెప్పి ఒప్పించాడు'

'రియల్లీ... హీ ఈజ్ గ్రేట్!'

'అతను కాదు గ్రేట్. వాళ్లకీ మనకీ మధ్య ఒక జనరేషన్ గ్యాప్ ఉన్నా... నేతి బీరకాయ నీతుల్ని కొయ్యకుండా నైతికతని పునర్నిర్వచించుకోగలిగారు చూడు ధీరజ్ తల్లిదండ్రులు... దే ఆర్ గ్రేట్! చూశావా... ఎదురెదురుగా కూర్చుని ఒకరితో ఒకరు వివరంగా మాట్లాడుకుని మాటల వంతెనలు వేసుకుంటే ఆకాశం కూడా అరచేతిలో పట్టేంత చిన్నదైపోతుంది. మనం ఇవన్నీ ఇలా ఫ్రీగా మాట్లాడుకునే అవకాశం ఉంటుందనే నీకు ఫేర్‌వెల్‌ని ఆఫీసులో కాకుండా ఇలా మా ఇంట్లో ఎరేంజ్ చేసింది. ఆఫీసులో అందరితో కాకుండా మనిద్దరమే సమావేశమయ్యేలా చేసింది.'

'థాంక్యూ వెరీమచ్ మేడం.... బై ది సేమ్ టైమ్ అయామ్ వెరీ సారీ'

'ఇదేమిటి... ఉన్నట్టుండి సారీ?'

'నేనో పొరపాటు చేశాను'.

'పొరపాటా... ఏమిటది?'

'మీ గురించి సరైన అవగాహన లేక... సారీ అవగాహన లేకపోవడం కాదు... దురవగాహనతో నా రెజిగ్నేషన్ లెటర్‌తోబాటుగా మీ క్యారెక్టర్ గురించి నా చేతికొచ్చిందల్లా రాశాను. ఇప్పుడనిపిస్తోంది. ఆ లెటర్ రాసి తప్పు చేశానని, అనుమానించాల్సిన పనిలేదు. ఖచ్చితంగా దానివల్ల మీకు బ్యాడ్ రిమార్క్ వస్తుంది'.

'పిచ్చిదానా... మార్కులు వెయ్యడానికి నువ్వు క్లాస్ టీచర్‌వీ కాదు. వాటిని చూసి రిమార్కులు రాయడానికి ఆ హెచ్చార్ డిపార్టుమెంట్ వాళ్లు ఎగ్జామినర్లూ కాదు. ఒకవేళ అదే నిజమైతే ఆ లెటర్ ఇలా నా చేతిలో కొచ్చేదీ కాదు'.

'ఎస్... ఇది నేను రాసిన లెటరే. మీ దగ్గరకెలా వచ్చింది?'

'ఇంపార్టెంట్ విషయం అది కాదు. నీ అంతట నువ్వే ఆ లెటర్ రాసినట్లు చెప్పావు చూడూ.... అదీ ఇంపార్టెంట్. రేపు నువ్వూ ఓ మంచి ఆర్గనైజేషన్‌లో పెద్ద పోస్టులోకి వెళ్తున్నావు. కనీసం అక్కడైనా చెత్తని చుట్టూ చేరనివ్వకు'.

'థాంక్యూ మేడం... థాంక్యూ వెరీమచ్'.

'ఇంక దీంతో పనేముంది?'

'మేడం... దాన్ని చింపొద్దు. ఇలా ఇవ్వండి. ఇది దగ్గరుంటే నా క్యారెక్టర్‌ని రూపొందించుకునే క్రమంలో ఎంతో సాయపడగలదు. నన్ను నేను వ్యక్తం చేసు కోవడానికి తీర్చిదిద్దుకోడానికి స్ఫూర్తినివ్వగలదు. ఇకనుంచైనా నేను మీ మాటల వంతెన గురించి ఆలోచించాలి'.

'బెటర్ టు స్టార్ట్ విత్ యువర్ హజ్బెండ్ ... బెస్టాఫ్ లక్.

*

రచయిత సెల్ నెం. 9440037258

కవిత



## హితవు

ఆనంద వాకిలి ఇది
చీకటి తోరణాలు కట్టకు
అందమైనదేహం ఇది
అసూయాపంకం చల్లకు

అరవిరిసిన మందారం ఇది
విరసుడవైతొక్కిపోకు
మండుతున్న గుండెలపై
ద్వేషఘృతం పొయ్యబోకు

కలిసి మెలిసి జీవించిన
అందమైన నందనమిది
బడబాగ్నిచ్చటలు రేపి
బూడిదగా మార్చబోకు

తరతరాల చరిత మనది
మరచిపోయి వదరవద్దు
పచ్చనిదీ సంసారం
చిచ్చుపెట్టి చీల్చవద్దు

- జానకీ జాని